
సాక్షి
ఒడిశా

బుధవారం । 9 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,86,982లు, బంగారం 3 గ్రాముల 600 మిల్లీగ్రాములు, వెండి 1 గ్రాము 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నిజమందిరానికి..

జగన్నాథుడు నిజ మందిరానికి చేరుకున్నాడు. పర్లాకిమిడిలో యాత్ర ముగిసింది. - 8లో



వన మహోత్సవం - 8లో

మల్కన్‌గిరిలో వన మహోత్సవం ఘనంగా జరిగింది. 200 మొక్కలు నాటారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ దృష్టికి ఇసుక కొరత సమస్య



కలెక్టర్ ఫరూల్ పట్వారికి సమస్యను వివరిస్తున్న గుణుపూర్ వాసులు

రాయగడ: గత ఆరు నెలలుగా జిల్లాలోని గుణుపూర్‌లో ఇసుక కొరత ఏర్పడిందని పట్టణ వాసులు జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి దృష్టికి తీసుకువచ్చారు. గుణుపూర్‌లోని వంశధార నదీ ప్రాంతంలో మూడు ఇసుక రీచ్‌లు ఉన్నప్పటికీ అవి ఆరు నెలలుగా మూత పడి పోవడంతో పట్టణంలో నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయని కలెక్టర్‌ను మంగళవారం కలిసి సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ ఇసుకను తీసుకురావడానికి 2,500 రూపాయల వరకు చెల్లించాల్సి వస్తుందని వివరించారు. దీంతో నిర్మాణ వ్యయం అధికమవ్వడంతో నానా అవస్థలు ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. వంశధార నదీ తీరంలో ఇసుక రీచ్‌లు పునః ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ కౌన్సిలర్ పూర్ణ బవురి, జితేంద్ర నాయక్, భైరబ్ బెహర, కేశవ్ మహంతి తదితరులు ఉన్నారు.

జల దిగ్బంధంలో భట్టారిక ఆలయం



వరద నీటి దిగ్బంధంలో భట్టారిక ఆలయం

భువనేశ్వర్: కటక్ జిల్లా బొడొంబ ప్రాంతంలో ప్రసిద్ధ భట్టారిక ఆలయం వరద నీటి దిగ్బంధంలో చిక్కుకుంది. మహానది వరద నీటి మట్టం దాదాపు ఆలయ శిఖరాన్ని తాకింది. ఈ ప్రమాదకర పరిస్థితుల్లో అవాంఛనీయ సంఘటనల నివారణ దృష్ట్యా దేవాదాయ శాఖ అప్రమత్తమైంది. ఓ వైపు మహా నది వరద నీరు ఉప్పొంగుతుంది. భట్టారిక ఆలయం జల దిగ్బంధంలో ఉన్నందున ఈ పరిసరాలకు రావద్దని సాధారణ ప్రజానీకాన్ని అప్రమత్తం చేసి ప్రధాన కూడలి ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేసింది. మరో వైపు ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాల్ని మోహరించారు.

నెల రోజులుగా 110 కుటుంబాలు అంధకారంలోనే..



కాలి పోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొరాపుట్: సుమారు నెల రోజుల పైగా 110 కుటుంబాలు అంధకారంలో జీవిస్తున్నాయి. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పంతలుంగు గ్రామ పంచాయతీ తుంబర్‌కోట్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోయింది. ఇది జరిగి నెల రోజులు దాటినా విద్యుత్ సిబ్బంది ఆ గ్రామం వైపు చూడడం లేదు. గిరిజనులు విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కి లిఖితపూర్వక ఫిర్యాదు పంపించారు. విద్యుత్ లేకపోవడంతో రాత్రి పూట గిరిజనులు బయటకు రావడం లేదు. సెల్‌ఫోన్లు పని చేయకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. భారీ వర్షాలు వల్ల విద్యుత్ లేకపోవడంతో అనేక బాధలు పడ్డామని గిరిజనులు వాపోయారు.

సేవాయత్‌లకు వ్యతిరేకంగా ఫిర్యాదు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని పవిత్ర రథ యాత్ర సమయంలో రథాలపై మొబైల్ ఫోన్ నిషేధాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలతో పూరీ శ్రీ జగన్నాథ ఆలయ కార్యాలయం సేవకుల వ్యతిరేకంగా ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుని ప్రాథమిక సమాచార నివేదికగా (ఎఫ్ఐఆర్) పరిగణించి వారి వ్యతిరేకంగా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరింది. రథాలపై మొబైల్ ఫోన్ల నిషేధాన్ని ఉల్లంఘించినందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. సేవకులు మొబైల్ ఫోన్లు ఉపయోగిస్తున్నట్లు చూపించే మూడు ఫొటోగ్రాఫిక్ ఆధారాలు ఫిర్యాదుతో జోడించారు. దీని ఆధారంగా విచారణ చేపట్టి నిందితుల వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపట్టాలని అభ్యర్థించినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీపీఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. రథాలపై సేవాయత్‌ల చర్యలు ఆచారాల పవిత్రతకు విఘాతం కలిగించాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రవాణా వ్యవస్థలో ప్రతిష్టంభన

- ఒడిశా డ్రైవర్ మహాసంఘం రాష్ట్రవ్యాప్త సమ్మె



డ్రైవర్ల మహా సంఘం సమ్మె

భువనేశ్వర్: అఖిల ఒడిశా ట్రక్, బస్సు డ్రైవర్ల మహా సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ఆరంభమైంది. ఈ ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా రవాణా సేవలను తీవ్రంగా ప్రభావితం చేసింది. రాష్ట్రంలో ప్రైవేట్ బస్సు, ట్రక్ యజమానుల సంఘం ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటించింది. అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సమ్మె ప్రభావంతో మంగళవారం రవాణా రంగం పూర్తిగా స్తంభించిపోయింది. అవగాహన లేని ప్రయాణికులు పలు చోట్ల బస్ స్టాపుల్లో చిక్కుకున్నారు. బస్సు సేవల పునరుద్ధరణ కోసం నిరీక్షించడంలో నిరుత్సాహానికి గురయ్యారు. సరుకు రవాణా కూడా తీవ్రంగా ప్రభావితమైంది. అఖిల ఒడిశా డ్రైవర్ల మహాసంఘం 6 ప్రధాన డిమాండ్లతో ఆందోళనకు నడుం బిగించింది. వాటిలో డ్రైవర్ల సంక్షేమ బోర్డులో ఆటో డ్రైవర్లను చేర్చడం, 60 ఏళ్లు పైబడిన డ్రైవర్లకు ఫించను భద్రత, ఎక్కడికక్కడ విశ్రాంతి గదులు, మరుగు దొడ్ల సౌకర్యాలు, ప్రతి 100 కిలో మీటర్ల పరిధిలో వాహనాల పార్కింగ్ స్థలాలు, డ్రైవర్ల భద్రతకు హామీపూర్వక చట్టాల అమలు, గనులు, పారిశ్రామిక ప్రాంతాలలో డ్రైవర్లకు ఉద్యోగాలు కల్పించడంలో 70 శాతం రిజర్వేషన్ సౌకర్యం, ఏటా సెప్టెంబర్ 1ని జాతీయ డ్రైవర్ల దినోత్సవంగా ప్రకటన ప్రధాన డిమాండ్లుగా చోటు చేసుకున్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా సమ్మె పట్ల స్పందించారు. డ్రైవర్ల సంఘం ప్రతిపాదిత డిమాండ్లను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు సంఘం ప్రతినిధి ప్రముఖుల్ని త్వరలో ఆహ్వానిస్తుందన్నారు. వీరి డిమాండ్లలో కొన్ని న్యాయ సమ్మతమైనవిగా అభిప్రాయం వ్యక్తం చేశారు. చర్చల ద్వారా ప్రతిష్టంభన తొలగించే దిశలో ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి ప్రకటించారు.

జయపురంలో..



జయపురంలో సమ్మె చేస్తున్న డ్రైవర్లు



రైల్వే స్టేషన్‌లో ఎరువులతో నిలిచిపోయిన వ్యాగన్లు



సమ్మె కారణంగా నిలిచిన బస్సులు

జయపురం: తమ డిమాండ్ల సాధనకు రాష్ట్ర డ్రైవర్ల మహాసంఘం రాష్ట్ర వ్యాప్త బంద్‌కు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జయపురంలో వందలాది మంది డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు. అందువల్ల ట్రక్కులు, బస్సులు నిలిచిపోయాయి. రైల్వేస్టేషన్ వద్ద ఎరువుల రవాణాకు అంతరాయం కలిగింది. ఇఫ్కో సంస్థ 2600 టన్నుల ఎరువులు రైల్వే వేగన్‌లలో ఉండిపోయాయి.

డ్రైవర్లు స్టీరింగ్ చోడొ ఆందోళన

రాయగడ: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా రాయగడ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్టీరింగ్ చొడొ ఆందోళన చేపట్టారు. స్థానిక సాయి ఇంటర్నేషనల్ కూడలిలో డ్రైవర్లు తమ నిరసన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సంక్షేమ బోర్డులో తమ పేర్లు నమోదు చేయాలని, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.



సాయి ఇంటర్‌నేషనల్ కూడలిలో ఆందోళన చేస్తున్న డ్రైవర్లు



కల్యాణ సింగుపూర్‌లో డ్రైవర్ల నిరసనలు

డ్రైవర్ల సమ్మెతో నిలిచిన ఎరువుల గూడ్స్ రైలు



జయపూర్‌లో ఆందోళన చేస్తున్న డ్రైవర్లు



నబరంగ్‌పూర్‌లో డ్రైవర్ల ఆందోళన

కొరాపుట్: డ్రైవర్ల సమ్మెతో రైతులకు నష్టం ఏర్పడింది. మంగళవారం ఒడిశా రాష్ట్ర ప్రైవేట్ డ్రైవర్ల సంఘం ఆకస్మిక సమ్మెకి పిలుపునిచ్చింది. దీంతో ఉదయం నుంచే డ్రైవర్లు స్టీరింగులు వదిలి ఆందోళనకు దిగారు. దీంతో ఈ సమ్మె రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. మంగళవారం వేకువ జామున 2,600 టన్నుల యూరియా ప్రత్యేక రైలు లో జయపూర్ స్టేషన్‌కి వచ్చింది. ఈ యూరియా లారీలు, వ్యాన్‌ల ద్వారా దుకాణాలకు,రైతులకు చేరాలి. కానీ డ్రైవర్ల నిరవధిక సమ్మెతో రైలు ర్యాక్ వద్దకి వాహనాలు రాలేదు. ప్రస్తుతం కొరాపుట్, మల్కన్‌గిరి, నబరంగ్‌పూర్ జిల్లాల్లో లక్షలాది ఎకరాలలో మొక్క జొన్న పంట వేశారు. వారికి మొదటి దశ యూరియా తక్షణం అందాలి. కానీ డ్రైవర్ల నిరవధిక సమ్మెతో రైతుల తీవ్ర ఆవేదనకి గురయ్యారు.



కొరాపుట్‌లో ఆందోళన

ఇరు జిల్లాలో డ్రైవర్ల సమ్మె

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ప్రైవేట్ వాహన డ్రైవర్లు నిరవధిక సమ్మెకి దిగారు. దాంతో బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. కొరాపుట్, సిమిలిగుడ, జయపూర్, బొరిగుమ్మ, నబరంగ్‌పూర్ పట్టణాల్లో డ్రైవర్ల ఆందోళన శిబిరాలు నడుస్తున్నాయి. మరో వైపు బుధవారం భారత్ బంద్ నేపథ్యంలో మంగళవారం ప్రయాణాలు పెట్టుకున్నవారు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. ఆంధ్రా, తెలంగాణ, చత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అంతర్రాష్ట్ర బస్సులు కూడా నిలిచి పోయాయి.



బొరిగుమ్మలో డ్రైవర్ల ఆందోళన

విధుల నిర్వహణలో అప్రమత్తతే కీలకం : డీఆర్‌ఎం



అప్రమత్తతతో ఘోర ప్రమాదాలు నివారించిన సిబ్బందిని సత్కరించిన డీఆర్‌ఎం

భువనేశ్వర్: రాత్రింబవళ్లు పట్టాలపై పరుగులు తీసే రైళ్ల నిర్వహణలో సిబ్బంది నిరంతర అప్రమత్తతే బలమైన భద్రతా కవచమని, రెప్పపాటు తప్పిదం కూడా ఘోర ప్రమాదాల్ని ప్రేరేపించే పరిస్థితుల్లో అప్రమత్తత ప్రదర్శించి విధుల నిర్వహణలో సిబ్బంది అంకిత భావం చాటుకున్నారని ఖుర్దారోడ్ రైల్వే మండల అధికారి (డీఆర్‌ఎం) హెచ్ఎస్ బజ్వా అన్నారు. డివిజన్‌లోని నలుగురు రైల్వే ఉద్యోగులను గుర్తించి భద్రతా అవార్డులతో సత్కరించారు. డీఆర్‌ఎం చేతుల మీదుగా సత్కారం పొందిన వారిలో లోకో పైలట్ పి.శ్రీనివాస రావు (ఖుర్దారోడ్), టీపీఎంఏ సుధాంశు స్వంయి (కటక్), టీపీఎంఏ అభిమన్యు దొళై (జఖ్‌పురా), సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (టెక్నికల్) ఉత్తమ్ కుమార్ దాస్ (ఖుర్దారోడ్, మెము కార్ షెడ్) ఉన్నారు. సిబ్బంది అభినందన సభ కార్యక్రమంలో అదనపు మండల రైల్వే అధికారి (ఇన్‌ఫ్రా) శుభ్ర జ్యోతి మండల్, సీనియర్ మండల భద్రత విభాగం అధికారి (ఎస్‌డీఎస్‌ఓ) నమో నారాయణ్ మీనా, ఇతర బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు. ఈ వేడుకలో డీఆర్‌ఎం హెచ్.ఎస్. బాజ్వా మాట్లాడుతూ పెను సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో సురక్షిత, సమర్థమైన రైళ్ల నిర్వహణలో అవిశ్రాంతంగా పని చేసే రైల్వే ఉద్యోగుల అచంచలమైన అంకిత భావం ప్రశంసనీయమన్నారు. వీరి అంకితభావం గుర్తించి అభినందించడం తోటి సిబ్బందిని ప్రోత్సహిస్తుందన్నారు. మండల అధికారుల అభినందనలతో ప్రత్యేక భద్రతా పురస్కారం అందుకున్న సిబ్బందికి తోటి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సేవా పేపరు మిల్లులో దొంగతనం

జయపురం: జయపురం సమితిలో గగణాపూర్‌లో గల సేవా పేపరుమిల్లులో దొంగతనం జరిగినట్లు జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఫిర్యాదు నమోదైంది. మిల్లులో కొన్ని టిన్ను డబ్బాలు, డ్రమ్ములు, రెండు ప్లాస్టిక్ కుర్చీలు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇద్దరు వ్యక్తులు రెండు డ్రమ్ములు దొంగతనంగా తీసుకువెళ్తుండగా చూసినట్లు భద్రతా బాధ్యతలు చూస్తున్న సుభాష్ మిశ్రా తెలిపారు. గగణాపూర్ పోలీసులు, పంటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ నేడు వెల్లడించారు.

మితిమీరిన భక్తి.. అరెస్టు

భువనేశ్వర్/పూరీ: భగవంతుని పట్ల భావోద్వేగంతో భక్తుల చేష్టలు అభ్యంతరకరంగా మారి అరెస్టుకు దారి తీశాయి. పూరీ శ్రీ జగన్నాథుని మారు రథ యాత్ర బహుడా పురస్కరించుకుని ఇద్దరు యువకుల తాబేళ్లపై శ్రీ జగన్నాథుని బొమ్మను ఆకర్షణీయంగా రంగులతో చిత్రించారు. ఈ చర్యను నేరంగా పరిగణించి అటవీ సిబ్బంది ఇద్దరు చిత్రకార భక్తుల్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద నిందితుల్ని అరెస్టు చేసినట్లు బిజేపూర్ అటవీ శాఖ అధికారి డీఎఫ్ఓ బిక్రమ్ దేవ్ పట్నాయక్ తెలిపారు.

స్కూలుకు తాళం



కాశీనగర్ బ్లాక్ అల్లడ పంచాయతీ లెంగడాగుడ ప్రాథమిక పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ అల్లడ పంచాయతీలో లెంగడాగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం గ్రామస్తులు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తరగతుల్లో 120 మంది చదువుతున్నారు. 2024లో ఈ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రిటైర్‌మెంట్ అవ్వగా మిగతా ముగ్గురు టీచర్లలో ఒకరిని క్లస్టర్ రిసోర్సు సెంటర్ కోఆర్డినేటరు, మరొకరిని బీఎల్ఓ డ్యూటీకి డీఈఓ మాయధర్ సాహు వేశారు. వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అభ్యసిస్తున్న లెంగడాగుడ ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వ నిధులు మంజూరవుతున్నా ఇప్పటివరకూ హెచ్ఎం పదవిని ప్రభుత్వం భర్తీ చేయలేదు. దీంతో విద్యార్థులు చదువు చెప్పే వారు కరువయ్యారు. ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించేవరకూ ఈ పాఠశాల తెరవడం సాధ్యపడదని జెడ్పీటీసీ మాజీ సభ్యులు సుకాంతి శోబోరో, ఉపాధ్యక్షురాలు కవితా బిడికా, సమితి సభ్యురాలు పార్వతీ శోబోరో విలేకరులకు వివరించారు.

దారికాచిన మృత్యువు..

- రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి
- భార్యకు తీవ్ర గాయాలు



కానిస్టేబుల్ కృష్ణ పూజారి (ఫైల్)



ప్రమాద స్థలంలో ట్రక్ కింద ఉన్న బైక్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి కత్తమేట గ్రామం వద్ద మంగళవారం టమటా లోడ్‌తో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి అటుగా వస్తున్న బైక్‌పై పడింది. బైక్‌పై వస్తున్న కానిస్టేబుల్ కృష్ణ పూజారి, భార్య రుక్మిణి పూజారి ట్రక్కు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో కృష్ణ పూజారి అక్కడికక్కడే మృతి చెందారు. రుక్మిణికి తీవ్రగాయాలయ్యాయి. ఆమె కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు వచ్చి ఇద్దరినీ బయటకు తీశారు. కృష్ణ మృతి చెందినట్లు గుర్తించారు. ఆమెను వెంటనే మత్తాలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి రుక్మిణికి మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అధిక బరువు వల్లే ట్రక్కు పడిపోయినట్లు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ట్రక్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు.

చెరువులో మునిగి తల్లీబిడ్డ మృతి



మత్తిలి ఆరోగ్య కేంద్రం వద్ద ప్రియా మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి దొడాగూఢ గ్రామంలో మంగళవారం ఓ తల్లీబిడ్డ స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గురునాథ్ బాగరియా భార్య ప్రియా(24) తన ఐదు నెలల కుమార్తె పింకీతో కలిసి మంగళవారం ఉదయం చెరువుకు వెళ్లింది. అయితే బిడ్డకు స్నానం చేయిస్తుండగా ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. ఉదయం వెళ్లిన వారు మధ్యాహ్నానికి కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామమంతా వెతికారు. చివరకు చెరువు వద్ద ప్రియ చీర కనిపించడంతో వెంటనే మత్తిలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు వచ్చి చెరువులో మునిగిపోయిన తల్లీబిడ్డను బయటకు తీశారు. తర్వాత మత్తిలి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఐఐసీ ప్రియదర్శిని సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోర్టుమార్టం కోసం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

17 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన దినేష్ బిభర్‌తో పోలీసులు

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయితో ఒక యువకుడిని రైల్వే, అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అతని నుంచి 17.400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువకుడు దినేష్ బిభర్‌గా గుర్తించారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి నిందితుడిని మంగళవారం కోర్టుకు తరలించారు. అబ్కారీ శాఖ అధికారి సంతోష్ కుమార్ ధల్ సామంత తెలియజేసిన వివరాల ప్రకారం.. ఎప్పటిలాగే రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలో బిభర్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతని బ్యాగును తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 1.70 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

అద్వితీయంగా అంతిమ ఘట్టం



మట్టి పాత్రల్లో రథాలపై దేవుళ్లకు రసుగుల్ల నైవేద్యం



రసగుల్ల మిఠాయితో నిండిన మట్టి పాత్రలు

భువనేశ్వర్: పవిత్ర ఆషాఢ శుక్ల పక్ష త్రయోదశి తిథి పురస్కరించుకుని శ్రీ జగన్నాథుని రథ యాత్ర అంతిమ ఘట్టం నీలాద్రి విజే మంగళవారం జరిగింది. దీంతో శ్రీ జగన్నాథుని వార్షిక రథ యాత్ర ముగిసింది. సంధ్యా ధూపం తర్వాత రథంపై ఉన్న మూల విరాటులతో ఉత్సవ మూర్తులను వరుస క్రమంలో గొట్టి పాహండి నిర్వహించి సురక్షితంగా శ్రీ మందిరం రత్న వేదికకు చేర్చడంతో నీలాద్రి విజే విజయవంతమై రథ యాత్రకు తెర పడింది. రథ యాత్ర క్రమంలో ఉత్సవ సేవాదులు నిర్వహించారు. రథాలపై మూల విరాటుల పూజలు ముగియడంతో రథాల పైనుంచి విగ్రహాల్ని దించేందుకు చారుమళ్ల ఏర్పాటు చేశారు. వీటి గుండా వరుస క్రమంలో మూల విరాటులతో ఉత్సవ మూర్తుల్ని శ్రీ మందిరం రత్న వేదిక పైకి తరలించారు. బుధ వారం నుంచి శ్రీ మందిరం రత్న వేదికపై భక్తులకు యథాతథంగా ఏడాది పొడవునా చతుర్ధా మూర్తుల దర్శనం ప్రాప్తిస్తుంది.

మహాలక్ష్మికి స్వామి బుజ్జగింపు

రథయాత్ర అంతిమ ఘట్టం నీలాద్రి విజే మహోత్సవంలో శ్రీ మహాలక్ష్మి దేవిని జగన్నాథ స్వామి బుజ్జగించే వైనం భక్త జనాన్ని ముచ్చట గొలిపించే అపురూప ఘట్టం. నీలాద్రి విజే సమయంలో సుదర్శనుడు, దేవీ సుభద్ర, బలభద్ర స్వామిని శ్రీ మందిరంలోనికి ఆహ్వానించిన శ్రీ మహా లక్ష్మి ప్రియ నాథుడు శ్రీ జగన్నాథుని ప్రవేశం అడ్డుకుని శ్రీ మందిరం సింహ ద్వారం తలుపులు మూసి వేస్తుంది. తనను విస్మరించి తోబుట్టువులతో యాత్రకు ఏగి విరహ వేదన తాళలేక స్వయంగా దర్శనం కోసం వెళ్లిన నిరుత్సాహ పరచడంతో శ్రీ మహా లక్ష్మి అలక ప్రదర్శించడం ఈ ముచ్చట గొలిపే ఘట్టం జానపద ఇతివృత్తం. దేవేరి అలక తీర్చేందుకు యాత్ర కానుకగా శ్రీ జగన్నాథుడు రసగుల్లాను దేవేరికి సమర్పించడంతో మురిసిపోయి సాదరంగా శ్రీ మందిరం లోనికి ఆహ్వానిస్తుంది. ఇది రథ యాత్రలో చిట్ట చివరి ముచ్చట గొలిపే ఘట్టం.

క్లుప్తంగా

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



అల్లెన పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

బూర్జ: మండలంలోని పాలవలస జెడ్పీహెచ్ స్కూల్, అల్లెన ప్రాథమికోన్నత పాఠశాలల్లో డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా పాలవలస జెడ్పీ హైస్కూల్ పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరుపై ఎంఈవోలు ఎస్.శ్యామసుందర రావు, బి.ధనుంజయరావులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యాబోధన ఏవిధంగా ఉందో విద్యార్థులకు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అల్లెన పాఠశాలలో విద్యార్థులు పాలవలస పాఠశాలలో మెర్జి చేయడంతో తల్లిదండ్రులు పంపించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. అయితే 100 మంది విద్యార్థులు ఉంటే గానీ యూపీ స్కూల్ కొనసాగించలేమని డీఈవో పేర్కొన్నారు. ఆయనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



హోంగార్డు జగన్నాథంకు చెక్ అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు పి.జగన్నాథంకు జిల్లా హోంగార్డుల యూనిట్ ఒక్కరోజు వేతనం రూ.4.09 లక్షలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి చేతులమీదుగా అందజేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జగన్నాథంకు చెక్ అందించారు.

మా భూములు తీసుకోవద్దు

నరసన్నపేట: ఎంఎస్ఎంఈవో పార్క్ నిమిత్తం తమ భూములు తీసుకోవడానికి ప్రభుత్వం చూస్తోందని, తమ భూములు తీసుకోవద్దని మండలంలోని జమ్ము గ్రామానికి చెందిన ఎస్సీ రైతులు బమ్మిడి రామారావు, తలసముద్రం రాజారావు, తాడి మొఖలింగంలతో పాటు పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తమ జీవనాధారానికి భూములను ఇచ్చిందని, ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్క్ పేరిట తాము సాగు చేసి పంటలు పండించుకుంటున్న భూములు తీసుకోవడానికి అధికారులు చూస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ఇది ఏమాత్రం తగదని పేర్కొన్నారు. ఆర్ఐ సాయిరాంతో పాటు వీఆర్వో, సర్వేయర్లు వచ్చి సోమవారం కొలతలు వేశారన్నారు. తమ భూముల వైపు అధికారులు రావద్దని కోరారు.

'ముప్పై ఏళ్లు టీడీపీలో కష్టపడ్డా.. గుర్తింపేదీ..?'



విలేకరుల సమావేశంలో ముక్కు ఆదినారాయణ

రణస్థలం: తాను ముప్పై ఏళ్లు టీడీపీలో కష్టపడ్డానని అయినా గుర్తింపు ఇవ్వలేదని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముక్కు ఆదినారాయణ అన్నారు. మండలంలోని రావాడ పంచాయతీలో తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశానని, ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేశానని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గ మార్కెట్ చైర్మన్ ఎస్సీ రిజర్వేషన్ అయిందని, అన్ని అర్హతలుండి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే తనను నామినేట్ చేయకుండా వేరేవాళ్లకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. దీనికి నిరసనగా తాను పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తానని, అలాగే టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటానని తెలిపారు.

విజిలెన్స్ దాడులు



తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు రహదారిలో జే.ఆర్.పురంలో ఉన్న ఎరువుల దుకాణంపై విజిలెన్స్, వ్యవసాయ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా స్టాక్ రిజిస్టర్‌తో ఎరువుల భౌతిక నిల్వలను పోల్చితే వ్యత్యాసాలు కనిపించాయి. అలాగే అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో ఎరువులను స్వాధీనం చేసుకొని, దుకాణం డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కానిస్టేబుల్ ఈశ్వర్, మండల వ్యవసాయ ఏవో డి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిజమందిరానికి చేరిన జగన్నాథుడు



నిజమందిరంలో జగన్నాథ, బలరామ, సుభద్రలు



రాజవీధి నుంచి బలభద్ర రథాన్ని లాగుతున్న భక్తులు

పర్లాకిమిడి: పదిరోజులపాటు గుండిచా రథయాత్రకు బయలుదేరిన జగన్నాథ, సుభద్ర, బలభద్రులు మంగళవారం ఉదయం మూడు రథాలతో నిజ మందిరానికి క్షేమంగా విచ్చేశారు. జిల్లా ఎస్పీ జ్యోతింద్రపండా, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, తహసీల్దారు, ఐఐసీ ప్రశాంత్ భూపతి, ఇతర భక్తుల సహాయంతో రాజవీధి నుంచి శ్రీమందిరం వరకూ రథాన్ని లాగారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మీదేవితో కలిసి శ్రీలక్ష్మీనారాయణ అవతారంతో రథాయాత్ర ముగుస్తుంది. ఆఖరిరోజున పెద్ద యాత్ర జరుగనున్నది.



జగన్నాథ, బలభద్ర రథాల వద్ద జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా, ఐఐసీ ప్రశాంత భూపతి



బలభద్ర రథాన్ని లాగుతున్న భక్తజనం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మన్మోహన్ సామల్



మన్మోహన్ సామల్

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా మన్మోహన్ సామల్ మరోమారు ఎన్నిక అయ్యారు. మంగళవారం ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర శాఖ సంస్థాగత ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన బీజేపీ కేంద్ర నాయకుడు సంజయ్ జైస్వాల్ ప్రకటన చేశారు. ప్రకటన వెలువడిన తర్వాత ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, మంత్రి వర్గం, పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ జై పండా, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు , సీనియర్ కార్యకర్తలు పార్టీ ప్రధాన కార్యాలయంలో వరుసగా నాలుగోసారి ఎన్నికైన మన్మోహన్ సామల్‌ను సత్కరించారు. రాష్ట్రంలో పార్టీ అత్యున్నత స్థానంలో ఇది ఆయన వరుసగా రెండు, సమగ్రంగా నాల్గో పర్యాయం ఈ హోదాకు ఎన్నిక కావడం విశేషం. గతంలో 1999, 2001లో బిజూ జనతా దళ్ (బీజేడీ)తో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వ సమయంలో ఆయన ఈ పదవికి ఎన్నికయ్యారు. 2023 మార్చిలో మరోసారి రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా ఎన్నిక అయ్యారు. ఈ వ్యవధిలో 2024 సార్వత్రి ఎన్నికల్లో పార్టీకి ఘన విజయాన్ని చేజిక్కించిన ఘనత సొంతం చేసుకున్నారు. రాష్ట్రం నుంచి అత్యధికంగా 20 లోక్ సభ స్థానాలను పార్టీ కైవసం చేసుకుంది. 2024 ఎన్నికల్లో ప్రతిపాదిత బీజేడీతో పొత్తును నిరాకరించి ఒంటరిగా పోరాడటానికి కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి తన దక్షత, నైపుణ్యతని చాటుకున్నారు. ఆ తర్వాత జరిగిన తాజా ఎన్నికల్లో మరోసారి రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా ఎన్నిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

బురదలో దిగబడిన బస్సు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి నీలిగూడ గ్రామం ప్రధాన రహదారిలో మంగళవారం పోడియా నుంచి మల్కన్‌గిరికి వెళ్తున్న బస్సు బురదలో దిగబడింది. రెండు గంటలపాటు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాక్టర్ సాయంతో బస్సును ఒడ్డుకు చేర్చారు. ఈ రహదారి పనులు గత రెండేళ్లుగా చేస్తున్నా పూర్తి కాలేదు. తరచూ ఈ రహదారిలో బైక్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వర్షం పడితే గోతుల్లో నీరుచేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బస్సును ట్రాక్టర్ సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

రాజ్యాంగ పరిరక్షణకే రాహుల్ పర్యటన



మాట్లాడుతున్న డీసీసీ కోఆర్డినేటర్ శశి భూషణ్ బెహరా, ఎమ్మెల్యేలు

కొరాపుట్: రాజ్యాంగ పరిరక్షణ కోసమే రాష్ట్రానికి రాహుల్ గాంధీ వస్తున్నారని కొరాపుట్ డీసీసీ కోఆర్డినేటర్ శశి భూషణ్ బెహరా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జయపూర్ మెయిన్ రోడ్డులోని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన భువనేశ్వర్‌లో రాజ్యాంగ పరిరక్షణ సభ జరుగుతుందన్నారు. ఈ సభకి రాహుల్‌తోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, తదితరులు వస్తారన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు, పేదలకు అందని సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై ఈ సభలో నిరసన గళం వినిపిస్తామని శశి భూషణ్ బెహరా పేర్కొన్నారు.

ఈ సమావేశంలో పార్టీ జిల్లా పరిశీలకుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్ గంగ్ పూర్, ఎమ్మెల్యే పి.ఎస్.రాజన్ హిక్కా, చిత్ర కొండ ఎమ్మెల్యే మంగులు కిలో, జయపూర్ మున్సిపల్ చైర్మన్ నొరి మహంతి, నాయకుటు నిమయ్ సర్కార్, రుపక్ తురుక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పలువురు రాజీనామా

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కుంద్రా సమితి సభ్యులు, సర్పంచ్‌లు రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం కొరాపుట్ జిల్లా కుంద్రా సమితికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జయపూర్ పట్టణంలోని సంగం కల్యాణ మండపంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తమ సమితి చైర్మన్ రాజేశ్వరి పరజాకి తాము అభివృద్ధి కోణంలో మద్దతు ఇచ్చామన్నారు. ఆమె భర్త సురేంద్ర పరజా, మరో కాంగ్రెస్ నాయకుడు టునా పట్నాయక్‌లు ఎన్నికైన సభ్యులకు విలువ ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయాలు చేస్తున్నారన్నారు. ఇది కాంగ్రెస్ పెద్దలకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తామంతా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఐదుగురు సర్పంచ్‌లు, ముగ్గురు సమితి సభ్యులు రాజీనామ చేశారు. కుంద్రాలో సమితి చైర్మన్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కోల్పోవలసి వస్తుంది. దీనిపై కాంగ్రెస్ నాయకుడు టునా పట్నాయక్ మట్లాడుతూ.. తనపై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి అని అన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్‌లు, సమితి సభ్యులు

వైభవంగా వనమహోత్సవం



మొక్కలునాటుతున్న దృశ్యం



కలిమెల పాఠశాల అవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఛలాన్‌గూఢ పంచాయతీలోని నర్సరీ వద్ద మంగళవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అటవీశాఖ డీఎఫ్‌వో సాయికిరణ డి.ఎన్ నేతృత్వంలో కార్యక్రమం జరగ్గ ముఖ్యఅతిథిగా మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం మన హక్కు అన్నారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. నాటిన మొక్కలను సక్రమంగా సరంక్షించాలని వక్తలు కోరారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్రశఖరో, ఛలాన్‌గూఢ సర్పంచ్ అరక్షిత నాయక్, ఛలాన్‌గూఢ పాఠశాల విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో 200 మొక్కలు నాటారు.

పాఠశాలల పరిశీలన

జయపురం: రాష్ట్ర పాఠశాలల గణ విద్యా విభాగ డైరెక్టర్ బిరేంద్ర కర్కర మంగళవారం జయపురం, బొయిపరిగుడలలో వివిధ పాఠశాలలను సందర్శించారు. జయపురం సమితి పాత్రోపుట్ నోడల్ ఉన్నత పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నోడల్ ఉన్నత పాఠశాలలో అధ్వానంగా ఉన్న పరిస్థితులను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయురాలిపై వెంటనే చర్య తీసుకోవాని, జీతం కట్ చేయాలని తనతో ఉన్న విద్యాధికారులను ఆదేశించారు. అనంతరం బొయిపరిగుడ సమితి చంద్రపడ ఉన్నత పాఠశాలను సందర్శించిన సమయంలో ప్రధాన ఉపాధ్యాయుడు లేక పోవటం, పాఠశాల పరిశుభ్రంగా లేక పోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో తగినంతమంది టీచర్లు లేని విషయాన్ని డైరెక్టర్ గుర్తించారు. అనంతరం విద్యాధికారులకు పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయలను నియమించే విషయంపై, విద్యార్థులు తక్కువగా ఉండటంపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.

పేరెంట్స్ సమావేశాలు నిర్వహించి పిల్లలను బడులకు పంపించేలా చూడాలని ఆదేశించారు. విద్యా విభాగ అదనపు డైరెక్టర్ సుధాంశు పాత్రో, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రశాంత కుమార్ మహంతి, జయపురం బ్లాక్ విద్యాధికారి చందన నాయిక్ ఉన్నారు.



పాత్రోపుట్ నోడల్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ కర్కర తదితరులు

కిశోర్, విద్యా చట్టాలపై అవగాహన



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ప్రదీకరణ కార్యదర్శి సుజాత

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో జయపురంలోని సరస్వతీ శిశు విద్యామందిర అరవిందనగర్ ప్రాంగణంలో సోమవారం కిశోర్ న్యాయ చట్టం 2015 (శిశు సంరక్షణ, భద్రత చట్టం) బాధ్యతాయుత విద్యా చట్టాలపై చైతన్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రదీకరణ జిల్లా అధ్యక్షులు, జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ మహంతి సూచన మేరకు నిర్వహించిన శిబిరంలో జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి ప్రద్యోమయి సుజాత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ.. కిశోర్ న్యాయ చట్టం గురించి వివరించారు. అలాగే బాలబాలికలు చదువుకునేందుకు నిర్బంధవిద్యా చట్టాలు కల్పించాయని, అలాగనే నేరాలు చేసే మైనర్ బాల బాలికలకు భద్రత, రక్షణ కల్పించి వారు చదువుకొనేందుకు కావాల్సిన వనరులపై అవగాహన కల్పించారు. పోస్కో ప్రత్యేక న్యాయ స్థానం ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ గాయిత్రీ దేవి, శిశు కళ్యాణ కమిటీ కొరాపుట్ అధ్యక్షులు గాయిత్రీ పాత్రో, పీఓఐసీ కొరాపుట్ రిషభ నాయిక్, జయపురం పట్టణ పోలీసు ఏఎస్ఐ సత్యబాది నాయిక్, సరస్వతీ విద్యామందిర్ పారాబెడ అధ్యాపకులు డాక్టర్ రమణీరంజన్ దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 9, 10 తరగతుల విద్యార్థులకు విజ్ఞాన ప్రతిభపై పోటీలు నిర్వహించి విజేతలకు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి ప్రద్యోమయి సుజాత చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథి

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పరశురాం మజ్జి



పరశురాం మజ్జి

కొరాపుట్: భారతీయ జనతా పార్టీలో అత్యున్నత జాతీయ కౌన్సిల్ సభ్యునిగా నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ పరశురాం మజ్జి నియమితులయ్యారు. మంగళ వారం అందుకు తగ్గ ఆదేశాలను రాష్ట్ర పార్టీ నాయకత్వం ప్రకటించింది. పరశురాం 2000–09 ల మధ్య రెండు సార్లు నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. జాతీయ కౌన్సిల్ సభ్యుని హోదా లో పార్టీ జాతీయ అధ్యక్షుని ఎన్నికలలో ఓటు వినియోగించుకునే హక్కు ఉంది. పరశురాంను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

జిల్లా సివిల్ సప్లై అధికారిగా మానస రంజన్



బాధ్యతలు స్వీకరిస్తున్న మానస రంజన్ మహాపాత్రో

జయపురం: కొరాపుట్ జిల్లా సివిల్ సప్లై నూతన అధికారిగా మానస రంజన్ మహాపాత్రో నియమితులయ్యారు. ఈయన మంగళవారం జయపురం జిల్లా సివిల్ సప్లై కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మహాపాత్రో ఇంత వరకు జాజ్‌పూర్ జిల్లా సివిల్ సప్‌లై అధికారిగా పనిచేస్తూ కొరాపుట్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకూ కొరాపుట్ జిల్లా సివిల్ సప్లై అధికారిగా ఉన్న ప్రదీప్ కుమార్ పండ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రదీప్ కుమార్ పండను జాజ్‌పూర్ జిల్లా సివిల్ సప్లై అధికారిగా రాష్ట్ర సివిల్ సప్లై విభాగం నియమించింది.

పేకాట శిబిరంపై దాడి

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి గురండి పంచాయతీ మధుసూదన్ పూర్ గ్రామంలో గత కొద్ది రోజులుగా జరుపుతున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడుల్లో రూ.2,44,100లు నగదు స్వాధీనం చేసుకుని 8 మందిని అరెస్టు చేసినట్టు గురండి ఐఐసీ ఓం నారాయణ పాత్రో తెలియజేశారు.

డ్రైవర్ల సంఘం ఆందోళన

మల్కన్‌గిరి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో డ్రైవర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పార్కింగ్ స్థలాల్లో విశ్రాంతి షెడ్లు, పింఛన్లు చేయాలని కోరారు. సుమారు రెండు వేల మంది డ్రైవర్లు ఆందోళనలో పాల్గొనడంతో బస్సులు, ఆటోలు లేక విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

సింహగిరి ప్రదక్షిణకు వేళాయె..!

● బుధవారం వేకువజాము నుంచి ప్రదక్షిణ

శ్రీకాకుళం: సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న సింహగిరి ప్రదక్షిణకు సంబంధించి మార్గాలు, దర్శన సమయాలను ఆలయ అధికారులు ఖరారు చేశారు. బుధవారం వేకువజాము నుంచి గురువారం సాయంత్రం వరకు ఈ గిరి ప్రదక్షిణ జరగనుంది.

పుష్పరథం తిరిగే మార్గం

తొలి పావంచ, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షి నగర్, జోడిగుడ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుగా, ఎంవీపీ కాలనీ, డబుల్ రోడ్డు, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, ఎస్ఏడీ కొత్త రోడ్, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకుంటుంది.

భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

సింహగిరి తొలి పావంచ వద్ద ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైలు రోడ్డు, హనుమంతవాక, విశాలాక్షి నగర్, జోడు గొల్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుగా, ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, నరసింహ నగర్, కోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పదార, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీ నగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి తొలి పావంచ వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.

దర్శన సమయాలు

భక్తులకు దర్శన సమయాలను కూడా అధికారులు ప్రకటించారు. బుధవారం ఉదయం గిరి ప్రదక్షిణ చేసి సింహాచలం చేరుకునే భక్తులకు రాత్రి 10 గంటల వరకు దర్శనాలకు కల్పిస్తారు. గురువారం ఉదయం ఐదున్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు, తిరిగి సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు దర్శనాలు లభిస్తాయి. సింహగిరిపై గురువారం ఆలయ ప్రదక్షిణలు చేయాలనుకునే భక్తులకు తెల్లవారుజామున మూడు గంటల నుంచి అనుమతిస్తారు. భక్తుల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా ఆర్టీసీ అధికారులు కల్పించారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ అమీర్ అలీ

కొత్తూరు: మండలంలోని వసప గ్రామానికి చెందిన లుకలాపు మిన్నారావు హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో మంగళవారం హాజరు పరిచినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. నిందితుడు శంకరరావు నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు మృతుడు మిన్నారావు పకోడి, బజ్జీలు కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ వెళ్తుంటాడు. దీనిలో భాగంగా మృతుడు మిన్నారావు ఈనెల 5వ తేదీ రాత్రి శంకరావు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లి పకోడి కొనుగోలు చేసిన నేపథ్యంలో ఇద్దరు మధ్యం వివాదం జరిగింది. మిన్నారావు గతంలో బాకీ డబ్బులు ఇవ్వకపోవడంతో బాకీ విషయంలో ఇద్దరి మధ్య కొట్లాట జరిగింది. కొట్లాటలో మిన్నారావు తలపై సుత్తితో తల వెనుకభాగంలో కొట్టడంతో పాటు చాకుతో పీకను కోసి చంపినట్లు సీఐ ఎండీ అమీర్ అలీ పాల్గొన్నారు

10 కేజీల గంజాయి స్వాధీనం

నరసన్నపేట: ఒడిశా నుంచి బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల గంజాయిని నరసన్నపేట పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు బసంత మహాపాత్రో, సిద్ధాంత స్వైన్‌లను అరెస్టు చేసినట్లు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎప్పటిలాగే మడపాం టోల్ గేట్ వద్ద నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ తదితరులు మంగళవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో సోదాలు చేయగా వీరి వద్ద గంజాయి గుర్తించామన్నారు. వీరిద్దరూ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభ పోలీసుస్టేషన్ పరిధిలోని కొండాలి గ్రామం నుంచి అక్రమంగా గంజాయిని బెంగళూరు తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. దీంతో గంజాయిని సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. గంజాయి రవాణాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్

క్లుప్తంగా

కొట్టిశలో ఎక్సైజ్ శాఖ దాడులు

వంగర: మండల పరిధి కొట్టిశ గ్రామంలో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యాపారులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అమరాన వెంకటరావు, కల్లూరి గవరయ్య, నూరి పోలిరాజుల నుంచి 29 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ



సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ అధికారి కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: విజయనగరం సబ్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారి ఎ.కృష్ణప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల తోటి ఖైదీలు గానీ, సిబ్బంది గానీ ఎటువంటి వివక్ష చూపించ రాదన్నారు. జైలు క్లినిక్‌లను సందర్శించే న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు నిర్వహిస్తున్న విధుల పట్ల ఆరా తీశారు. జైల్లో ఉన్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆకస్మిక తనిఖీలో సబ్ జైల్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా సావిత్రి



కె.సావిత్రి

విజయనగరం టౌన్: డీఆర్‌డీఏ, వెలుగు ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కె.సావిత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పీడీగా పనిచేసిన కల్యాణ్ చక్రవర్తి సెర్ప్ డైరెక్టర్‌గా బదిలీ అవడంతో, ఏపీడీ సావిత్రికి పీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ తమ సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా అధికారులను, సిబ్బందిని కోరారు. సమష్టిగా పనిచేసి పథకాలను, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

కశ్మీరీ పండిట్ గలాటా..!

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కశ్మీరీ పండిట్ మరోసారి స్థానికులను భయాందోళనకు గురిచేశాడు. మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని పద్మావతి నగర్‌లో ఉంటున్న కశ్మీరీ పండిట్ తన ఇంటి సమీపంలో అక్రమంగా గోవులను పెంచడం వాటి సంరక్షణపై నిర్లక్ష్యం వహించడాన్ని స్థానికులు, చుట్టు పక్కల వారు ప్రశ్నించిన పాపానికి వారిపైనే తిరిగి దాడులకు దిగాడు. దీంతో వారిలో కొందరు డయల్ 100కు కాల్ చేయగా మరి కొందరు నేరుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హుటాహుటిన రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. గతంలో కూడా ఈ తరహాలోనే పశువులను అన్యాయంగా తన జాగాలోనే బంధించి చిత్ర వధ చేశాడని స్థానికులు సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఆ కశ్మీరీ పండిట్ నేరుగా సీఐతో కూడా గలాటాకు దిగడంతో కేసు నమోదుకు సిద్ధపడ్డారు. ఈ విషయంపై సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరాగా సదరు కశ్మీర్ పండిట్ పిచ్చోడిగా కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు.

చెక్‌బౌన్స్ కేసులో దంపతులకు జైలుశిక్ష

గజపతినగరం రూరల్: సకాలంలో డబ్బులు తిరిగి చెల్లించక పోవడంతో చెక్ బౌన్స్ కేసులో దంపతులకు జైలుశిక్ష విధించినట్లు గజపతినగరం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురిటిపెంట గ్రామానికి చెందిన గణరాజు అప్పలనరసింహరాజు, జ్యోతి దంపతుల దగ్గర లవుడు అప్పలనాయుడు, లక్ష్మి దంపతులు అవసరం నిమిత్తం కొంత నగదు అప్పుగా తీసుకున్నారు. ఆ సొమ్ము తిరిగి చెల్లించక పోవడంతో చెక్‌బౌన్స్ కేసు ద్వారా అప్పలనాయుడికి రెండేళ్లు, లక్ష్మికి ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

నగలు, నగదు చోరీపై ఫిర్యాదు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో చెరువు గట్టు వీధిలో నివాసం ఉంటున్న పిల్లి రాము ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం పట్టణ పోలీసులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తన భార్య బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి తన రోజువారీ పనుల నిమిత్తం చంటి బయటకు వెళ్లగా తిరిగి వచ్చి చూసేసరికి వేసిన తాళం వేసినట్లు ఉండి ఇంట్లో ఉన్న బీరువా తెరిచి బట్టలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు పిల్లి రాము గుర్తించారు. ఈ చోరీలో ఐదు తులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ.12 వేల నగదు అపహరించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యపరీక్షల కోసం అధిక సంఖ్యలో వచ్చిన రోగులు

బొండపల్లి మండలానికి చెందిన షేక్ రహీం అనే వ్యక్తికి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా మలేరియాగా నిర్ధారణ అయ్యింది. ప్లేట్‌లెట్స్ 23 వేలు తగ్గిపోయాయి.



ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థి పేరు ఎస్.సాయికుమార్. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. ఇదే గ్రామంలోని పాఠశాలల్లో 7వ తరగతి చదువుతున్నాడు. జ్వరం, తలనొప్పి ఉందని విజయనగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. తగ్గకపోవడంతో తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లేసరికే కోమాలోకి వెళ్లిపోయాడు. అక్కడ నుంచి విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చేర్పించారు. వారం రోజులు పాటు చికిత్స పొందిన చిన్నారి సోమవారం రాత్రి మృతిచెందాడు.

జ్వరాల వణుకు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

- జ్వరంతో పెదవేమలికి చెందిన విద్యార్థి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి
- బొండపల్లికి చెందిన ఓ వ్యక్తి మలేరియాతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స
- జిల్లాలో 249 మలేరియా, 28 డెంగీ కేసుల నమోదు
- జ్వరపీడితులకు పడిపోతున్న ప్లేట్‌లెట్స్

విజయనగరం ఫోర్ట్: జిల్లా ప్రజలపై జ్వరాలు పంజావిసురుతున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ఏ ఇంటి చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వద్ద క్యూకడుతున్నారు. వాతావరణంలో మార్పులు, దోమల ఉద్ధృతితో జ్వరాల వ్యాప్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో టైఫాయిడ్, వైరల్, మలేరియా, డెంగీ జ్వరాలు సోకిన రోగులు అధిక సంఖ్యలో చికిత్స పొందుతున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నారు. పెద్దలతో పాటు పిల్లలు కూడా అధికమంది జ్వరాల బారిన పడడం ప్రజలతో పాటు వైద్యవర్గాలను ఆందోళన కలిగిస్తోంది.

జ్వరాల కట్టడికి చర్యలు

జిల్లాలో జ్వరాలు, వ్యాధుల వ్యాప్తి కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధులు ప్రబలిన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు చేస్తున్నాం. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నాం.

– జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

1.44 లక్షల కేసుల నమోదు

జిల్లాలో లక్షలాది మంది జ్వరాల బారిన పడ్డారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై 7వ తేదీ నాటికి ప్రభుత్వాస్పత్రుల్లో 1.44 లక్షల మంది జ్వరాలతో వైద్యసేవలు పొందారు. 249 మలేరియా, 28 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందేవారిని లెక్కిస్తే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందన్నది అంచనా. జిల్లాలోని సర్వజనాస్పత్రిలో రోజుకు 1000 నుంచి 1200 వరకు ఓపీ నమోదవుతుండగా, ఏరియా, సామాజిక ఆస్పత్రుల్లో 400 నుంచి 500 వరకు ఓపీ నమోదవుతోంది. పీహెచ్‌సీల్లో కొన్నిరోజులు 50 నుంచి 100వరకు ఓపీ నమోదవుతోంది. వీరిలో అధికమంది జ్వరాలతో బాధపడుతున్నవారే ఉంటున్నారు.

యుద్ధప్రాతిపదికన సీసీఆర్సీ పంపిణీ జరగాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో యుద్ధప్రాతిపదికన సీసీఆర్ కార్డుల పంపిణీ జరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సొంత భూమిలేని కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు అందించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే రెవెన్యూ శాఖ జారీచేసే కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని, ఈ కార్డులు కలిగిన వారు మాత్రమే పంట నమోదు చేసుకునే అవకాశం ఉందని, పంట నమోదు ఆధారంగా పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర వ్యవసాయ పథకాలు అమలవుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. కావున ఇన్ని ప్రయోజనాలు ఉన్న సీసీఆర్ కార్డుల పంపిణీ త్వరగా పూర్తిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా త్రైమాసికానికి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలు, సాధించిన ప్రగతి వివరాలను ఎప్పటికప్పుడు తన కు నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా గ్రామ వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డా.ఎస్.మన్మథరావు, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఏవీ సాల్మన్ రాజు, మత్స్య అభివృద్ధి అధికారి యు.చాందిని, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మరోమారు అగ్నిప్రమాదం



ఆందోళనతో పాఠశాలకు వెలుపలకు వచ్చి ఉన్న విద్యార్థులు

- షార్ట్ సర్క్యూట్ కారణమని అనుమానం
- కాలిబూడిదైన పరుపులు, టేబుల్స్, విద్యార్థుల సామగ్రి
- సురక్షితంగా బయటపడిన 270 మంది విద్యార్థినులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ శివారు అడ్డూరువాని పాలెం వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మరోమారు మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. గత నెల 25వ తేదీ రాత్రి అగ్నిప్రమాదం జరగ్గా సుమారు 280 పరుపులు, విద్యార్థులకు సంబంధించిన సామగ్రి కాలిపోయిన విషయం తెలిసిందే. కాగా ఈ ప్రమాదం గురించి విద్యార్థులు మర్చిపోకముందే మరో ప్రమాదం జరగడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై విద్యార్థులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి భోజనం చేసి విద్యార్థులందరూ వరండాలో చదువుకుంటున్నారు. ఇంతలోనే ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు లోనై బయటకు పరుగులు తీశారు. ఆ సమయంలో రోడ్డుపై వెళ్లేవారు గమనించి వెంటనే కొత్తవలస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక అధికారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పాఠశాల వద్దకు హుటాహుటిన వెళ్లి మంటలను అదుపుచేశారు.అప్పటికే విద్యార్థులకు సంబంధించి 15 వరకు పరుపులు, పుస్తకాలు, టేబుల్స్, ఎల్‌ఈడీ టీవీ కాలిపోయాయి. ఈ నెల 25న పై అంతస్తులో ప్రమాదం జరగగా నేడు అదే భవనం కింద ప్రమాదం జరగడంతో తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

ఆందోళనలో విద్యార్థులు

పాఠశాలలో వరుస అగ్నిప్రమాదాలు జరగడంపై విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. ముగ్గురు విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోవడంతో 108 వాహనంలో కొత్తవలస మండల కేంద్రంలో గల ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు

పాఠశాలలో వరుస అగ్నిప్రమాదాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ పాఠశాల వద్దకు చేరుకున్నారు. వరుస అగ్నిప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అసలు పాఠశాలలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అగ్నిప్రమాదాలకు గల కారణాలను అన్వేషించాలని మానవ తప్పిదమైతే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

బైక్ ఢీకొని దివ్యాంగుడి మృతి

దత్తిరాజేరు: మండలంలోని ఎస్ బూర్జవలస పోలీస్ స్టేషన్ పరిధి కుంటినవలస రోడ్డులో ఎదురుగా వస్తున్న మూడు చక్రాల వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కుంటినవలస గ్రామానికి చెందిన దివ్యాంగుడు జక్కు సత్యం(69)తలకు తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మెంటాడ మండలం కుంటినవలస గ్రామానికి చెందిన సత్యం దివ్యాంగుడు కావడంతో సోమవారం సాయంత్రం మూడు చక్రాల వాహనంపై మరడాం వచ్చి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా కుంటినవలస నుంచి ద్విచక్ర వాహనంపై మరడాం వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో ప్రమాదం జరిగి మృతి చెందినట్లు తెలిపారు.

బొలెరో ఢీకొని యువకుడు..



సంతోష్ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస కోల్డ్ స్టోరేజ్ సమీపంలో మంగళవారం ఓ బైక్‌ను ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాన్ ఢీ కొట్టడంతో బైక్‌పై ఉన్న యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాచిపెంట గ్రామానికి చెందిన పడాల సంతోష్(24) ద్విచక్రవాహనంపై రామభద్రపురం మీదుగా దత్తిరాజేరు మండలంలోని కృష్ణాపురం తన బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. సరిగ్గా ముచ్చర్లవలస కోల్డ్‌స్టోరేజ్ వద్దకు వచ్చేసరికి విజయనగరం నుంచి ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాన్ ఢీ కొట్టడంతో సంతోష్ అక్కడక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు ఎస్సై వి. ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. సంతోష్ విశాఖపట్నంలోని గీతం వైద్యకళాశాలలో పనిచేస్తున్నాడు.

28న మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్



మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: కళలకు కాణాచి, విద్యలనగరం, క్రీడలకు పుట్టినిల్లు విజయనగరంలో ఈనెల 28న మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నిర్వాహకుడు కనకల కృష్ణ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోటీల నిర్వహణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కనకల ఎర్రయ్య మెమోరియల్ క్లాసిక్ క్లబ్ నేతృత్వంలో 8 కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రూ.1.20 లక్షల మొత్తాన్ని నగదు ప్రోత్సాహకంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది నిర్వహించిన పోటీల్లో 184 మంది పాల్గొన్నారని, ఈ ఏడాది నిర్వహించే పోటీల్లో 200మందికి పైగా వ్యాయామ సాధకులు పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనే వారికి ఉచితంగా భోజన వసతిసదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అభినవ భీముడు కోడి రామమూర్తి, నాగమల్ల పైడిరాజుల స్ఫూర్తితో నిర్వహించే కార్యక్రమంలో క్రీడాభిమానులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కోరాడ శ్రీనివాసరావు, కోట్ల రమేష్, వంశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' వాహనాలను వెంటనే గుర్తించాలి

- ఎస్పీ ఆదేశాలు



డీపీఓలో హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: హిట్ అండ్ రన్ కేసుల్లో వాహనాలను వెంటనే గుర్తించాలని నమోదైన కేసుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పోలీస్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం ఆదేశించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న 'హిట్ అండ్ రన్, గుర్తు తెలియని మృతదేహాల కేసులను ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. 'హిట్ అండ్ రన్' కేసుల్లో నేరానికి పాల్పడిన వాహనాన్ని సాధ్యమైనంత వేగంగా గుర్తించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. నేర స్థలం నుంచి వాహనం వెళ్లే మార్గంలోగల అన్ని సీసీ కెమెరాలను, ఫుటేజులను, టోల్ గేట్స్ రికార్డులను పరిశీలించాలని సూచించారు. కేసుల్లో దర్యాప్తు అంశాలను ఎప్పటికప్పుడు కేసు డైరీల్లో పొందుపర్చాలని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్‌కే చౌదరి, ఎస్.శ్రీనివాస్, ఎల్.అప్పలనాయుడు, బి.సుధాకర్, వివిధ పోలీసు స్టేషన్ల చెందిన పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

ఖరీఫ్ రుణ లక్ష్యం రూ.300 కోట్లు

- డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున



మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున

రామభద్రపురం: జిల్లాలో ఈ ఖరీఫ్‌లో సహకార బ్యాంకుల ద్వారా రైతులకు సుమారు రూ.300 కోట్లు వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఈ మేరకు రామభద్రపురంలోని డీసీసీబీ బ్రాంచ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు ఇప్పటి వరకు రూ.80 కోట్లు వ్యవసాయ రుణాలు అందజేశామన్నారు.జిల్లా సహకార బ్యాంకు ద్వారా రూ.2000 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని,ఇందులో రూ.1700 కోట్ల వరకు ఆప్కాబ్‌లో అప్పుతేగా రూ.300 కోట్లు బ్యాంకువని చెప్పారు. వినియోగదారులకు సేవందించడంలోను, డిపాజిట్స్ పెంచడంలోనూ ఎస్‌బీఐ, ఏపీజీవీబీ యూనియన్ బ్యాంకులతో పోటీ పడేలా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. అలాగే జిల్లాలో ఉన్న 24 సహకార సంఘాలను మోడరైజేషన్ చేస్తున్నామన్నారు. త్వరలో సహకార సంఘాలకు యూరియా సరఫరా అవుతుందని, ఈ ఏడాది రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జి.చంద్రమోహననాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి పోలీస్ శాఖ 'చేయూత'



హోం గార్డ్ కుటుంబానికి చెక్కు ఇస్తు
ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీసు శాఖలో హెూంగార్డుగా విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పనిచేసి, ఇటీవల కార్డియాక్ సమస్యతో మరణించిన శ్రీనివాస్ కుటుంబానికి చేయూత' పేరుతో రూ.3,23,050 చెక్కును ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. హోంగార్డు సిబ్బంది మొత్తం పోగుచేసిన ఒక రోజు డ్యూటీ అలవెన్స్ చెక్కును ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాఖలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసినా లేదా ప్రమాదవశాత్తు కానీ ఆకస్మికంగా, అనారోగ్యంతో మరణించిన హెూంగార్డు కుటుంబాలు ఇంటి యజమానిని కోల్పోయి, ఆర్థికంగా చితికిపోయిన నష్టాల్లో కూరుకుపోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు హెూంగార్డ్స్ అందరూ స్వచ్ఛందంగా ఒక్క రోజు డ్యూటీ అలవెన్స్ మొత్తాన్ని బాధిత కుటుంబాలకు అందజేయడం అభినందనీయమని ఎస్పీ ప్రశంసించారు. హోం గార్డు మరణానంతరం ఆయన కుమారుడిని హెూంగార్డుగా నియమించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, హెూంగార్డ్స్' ఇన్చార్జ్ ఆర్.రమేష్ కుమార్, డీపీఓ సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీస్‌కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

14న ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్ మేళా

Register through QR Code

అభ్యర్థుల పేర్లను నమోదు చేయాల్సిన క్యూఆర్ కోడ్

విజయనగరం అర్బన్: ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా (పీఎంఎన్‌ఏఎం)ను ఐటీఐ విద్యార్థులకు ఈ నెల 14న స్థానిక ఐటీఐ ప్రాంగణంలో నిర్వహిస్తామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అప్రెంటిస్ అడ్వైజర్ వీవీగిరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అప్రెంటిస్ ఇవ్వడానికి ఈస్ట్‌కోస్ట్ రైల్వేతోపాటు ప్రైవేట్ రంగానికి చెందిన జయభేరి ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, భగవతి ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్యూసిప్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, సాంసంగ్ ఆథరైజ్ సర్వీస్, నవదీప్ ఎలక్ట్రానిక్స్, బోల్టాస్ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్, ఐఎఫ్‌బీ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్, విజయనగర్ బయోటెక్ తదితర ప్రముఖ కంపెనీలు ఎంపిక చేస్తాయని తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టైపెండ్ చెల్లించనున్నట్లు జిల్లా కన్వీనర్ తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోస్‌తో పాటు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9441518355, 9849944654 నంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు. పేర్లను నమోదు చేసుకోవడానికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం



టైరు పంక్చర్ అయిన తరువాత వెలుపలికి వచ్చిన మరో టైరు

వంగర: మండల పరిధి మగ్గూరు-మద్దువలస రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. మంగళవారం కొప్పర నుంచి రాజాం మీదుగా పాలకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు మగ్గూరు దాటిన తరువాత వెనుక టైరు పంక్చర్ అయి పేలిపోయింది. వెనుక భాగంలో ఉన్న రెండు టైర్లలో ఒక టైరు రోడ్డు వెలుపలికి రావడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఏ ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ బస్సులో ఆ సమయంలో సుమారు 50 మంది వరకు ప్రయాణికులున్నారు.

నాణ్యతలేని ఆహారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు

- 12 మంది వ్యాపారులకు రూ.3 లక్షలు జరిమానా
- జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్

విజయనగరం అర్బన్: నాణ్యతలేని కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ హెచ్చరించారు. జిల్లాలో నాణ్యతలోపించిన ఆహారాన్ని విక్రయించిన 12 మంది వ్యాపారులకు రూ.3 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. రాజాంలో నలుగురు, బొబ్బిలిలో ఇద్దరు, గజపతినగరంలో ముగ్గురు, దత్తిరాజేరులో ఒకరు, కొత్తవలసలో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

స్త్రీనిధి రుణలక్ష్యం రూ.283 కోట్లు

లక్కవరపుకోట: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల్లోని 28,298 మంది మహిళలకు స్త్రీ నిధి నుంచి రూ.283 కోట్ల రుణాలు అందజేసేందుకు ప్రణాళికలు రూపొందించామని స్త్రీ నిధి ఏజీఎం వై.చిట్టిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,458 మంది మహిళలకు రూ.38.98 కోట్ల రుణాలు అందజేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జి.సింహాచలం, సీసీ అబద్ధం పాల్గొన్నారు.

ఎన్‌ఐఏ కస్టడీలో సీరాజ్, సమీర్

విజయనగరం క్రైమ్: ఉగ్రభావజలంతో పేలుళ్లకు కుట్రపన్ని విశాఖ సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సీరాజ్, సమీర్‌లను మంగళవారం అర్ధరాత్రి ఎన్‌ఐఏ తమ కస్టడీలోకి తీసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి కొద్ది రోజుల కిందటే ఎన్‌ఐఏ అధికారులు ఐదుగురు ఈ కేసు విషయమై విజయనగరం టూటౌన్ పోలీసులను కలిశారు. కోర్టు అనుమతితో నిందితులు ఇద్దరినీ ఎన్‌ఐఏకు అప్పగించాల్సి ఉంది. రెండు రోజుల కిందట కోర్టు వీడియోకాన్ఫరెన్స్‌లో ఇద్దరు ఖైదీలను విచారించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఇక నుంచి ఎన్‌ఐఏ అధికారులు కేసును విచారణ జరపనున్నట్టు టుటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.